క్లుప్తంగా

ఇంటింటికి అయోధ్య అక్షతలు



అయిజ: అయోధ్యలో నూతనంగా నిర్మించిన రామ మందిరంలో ఈనెల 22న శ్రీరాముడి విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా అయోధ్య నుంచి పంపించిన అక్షతలకు శనివారం మండల కేంద్రంలోని భీమరాయుడి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వివిధ కాలనీల్లోని ప్రజలకు అక్షతలు పంపిణీ చేశారు. అక్షతలతో పాటు రామాలయం చిత్రపటం అందించారు. ఈ సందర్భంగా ఆయల కమిటీ వారు మాట్లాడారు. ఈనెల 22న ప్రతి ఇంట్లో దీపం వెలిగించాలని తెలిపారు.

ప్రమాదకరంగా కూలీల తరలింపు



ధరూరు: బతుకు దెరువు కోసం నిత్యం ఇతర ప్రాంతాలకు కూలీ పనులకు వెళ్లే కూలీల ప్రాణాలతో వాహనదారులు చెలగాటమాడుతున్నారు. మండలంలోని ఆయా గ్రామాల్లో, కేటీదొడ్డి మండలాలకు చెందిన వందలాది మంది వ్యవసాయ కూలీలు గద్వాల, ఇటిక్యాల మండలాల్లో పొలాల్లో పత్తి, మిరప తెంచేందుకు నిత్యం బొలెరో వాహనాల్లో కిక్కిరిసి వెళ్తున్నారు. గూడ్స్ తరలించే వాహనాల్లో 30 నుంచి 40 మంది కూలీలను ఎక్కించుకుని గద్వాల – రాయిచూరు మార్గంలో వెళ్లి రావడం నిత్యకృత్యంగా మారింది. అతి వేగం, మలుపుల వద్ద కటింగులు కొడుతూ కూలీలను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. గత్యంతరం లేక కూలీలు గూడ్స్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు. ఇలాంటి వాహనాలపై అటు పోలీసులు, ఇటు ఆర్‌టీఏ అధికారులు దృష్టి పెట్టకపోవడంతో ఎప్పుడూ ఏ ప్రమాదం సంభవిస్తుందో తెలియని పరిస్థితి ఏర్పడింది. సంబంధిత శాఖ అధికారులు కూలీలను తరలించే వాహనాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని మండల ప్రజలు కోరుతున్నారు.

గెలుపొందిన వారికి బహుమతులు



పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండల కేంద్రంలో హనుమాన్ యూత్ ఆధ్వర్యంలో కీ.శే. దేవని చంద్రయ్య జ్ఞాపకార్థం అతని సోదరుడు శ్రీనివాసులు సహకారంతో ఉమ్మడి జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఫైనల్‌లో మొదటి విజేతగా కొత్తకోట మండలం, సంకిరెడ్డిపల్లి క్రీడాకారులు రూ.30వేల నగదుతో పాటు ట్రోఫీ, రెండో బహుమతి రూ. 20వేలు గెలుపొందారు. వారికి ఎంపీపీ గాయత్రి, విండో అధ్యక్షులు జగనాథంనాయుడు, బీఎస్పీ మండల అధ్యక్షులు దేవని శ్రీనివాసులు అందజేశారు. కార్యక్రమంలో పృథ్వీరాజు, విజయ్, శ్రీహరి, రాజు, బుచ్చన్న, నరేష్‌నాయుడు, దేవని చంద్రయ్య కూతురు సుష్మ, వసంతపురం రాజు, కాళ్ల రాఘవేందర్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాస్ఫూర్తిని ప్రదర్శిస్తేనే రాణిస్తారు



వీపనగండ్ల: యువకులు క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించి గెలుపోటములు సమానంగా తీసుకున్నప్పుడే క్రీడల్లో రాణించగలుగుతారని జిల్లా ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు ఇంద్రకంటి వెంకటేష్, ఎస్ఐ రవిప్రకాశ్ అన్నారు. శనివారం సంగినేనిపల్లిలో ఇంద్రకంటి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మండల స్థాయి వాలీబాల్ పోటీలను వారు ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మౌలాలి, మండల రైతుబంధు సమితి మాజీ అధ్యక్షులు నారాయణరెడ్డి, ఎత్తం కృష్ణయ్య, విజయభాస్కర్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, కృష్ణయ్య, చక్రవెంకటేష్, ధనుంజయ, రాంరెడ్డి, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ పోటీలకు గోపాల్‌పేట విద్యార్థులు

గోపాల్‌పేట: జార్ఖండ్ రాష్ట్రంలోని రాంచీలో జనవరి 16 నుంచి నిర్వహించే ఫుట్‌బాల్ ఎస్జీఎఫ్ అండర్–14 టోర్నమెంట్‌లో గోపాల్‌పేట జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ఆడనున్నారని పీడీ సురేందర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు రమాకాంత్ తెలిపారు. నవంబర్ 17 నుంచి 19 వరకు గద్వాలలో రాష్ట్రస్థాయి పోటీల్లో గోపాల్‌పేట జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. అండర్ 14లో ప్రశాంత్, శైలజ, మాధవి జాతీయ స్థాయిలో ఆడటం గర్వంగా ఉందని ఉపాధ్యాయులు శుభాకాంక్షలు తెలిపారు.

‘మధ్యాహ్న భోజనం’ బిల్లులు అందేనా?

- నాలుగు నెలలుగా అందని వైనం
- నిర్వహకులకు తప్పని తిప్పలు
- అప్పు చేసి పిల్లలకు భోజనం..



మానవపాడులో మధ్యాహ్న భోజనం పరిశీలిస్తున్న ఎంఈఓ శివప్రసాద్ (ఫైల్)

మానవపాడు: ‘మధ్యాహ్న’ భోజన పథకంలో పని చేసే కార్మికులకు సకాలంలో బిల్లులు అందడం లేదు. దీంతో వారు అధిక వడ్డీలకు అప్పు తీసుకొచ్చి మధ్యాహ్న భోజన పథకాన్ని కొనసాగిస్తున్నారు. సర్కారు సకాలంలో నిధులు మంజూరు చేయడం లేదు. ప్రభుత్వం పాఠశాలల్లో డ్రాప్‌అవుట్ తగ్గించాలనే ఉద్దేశంతో మధ్యాహ్న భోజన పథకం ప్రారంభించింది. బిల్లులు సకాలంలో అందించకపోవడంతో కార్మికులు అప్పు చేసి విద్యార్థులకు భోజనం పెడుతున్న పరిస్థితి నెలకొంది.

అలంపూర్ నియోజకగవర్గంలోని 7మండలాల్లో 124 గ్రామ పంచాయతీలు ఉండగా, వాటిలో మొత్తం ప్రభుత్వ పాఠశాలలు 226 ఉన్నాయి. ఇందులో 125 ప్రాథమిక, 52 ప్రాథమికోన్నత, 49 జడ్పీ పాఠశాలలున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో దాదాపు 29,265 మంది విద్యార్థులు ఉన్నారు. వారికి ప్రతి రోజు మధ్యాహ్న భోజనం వండి పెట్టేందుకు దాదాపు 245 మంది నిర్వహకులు పని చేస్తున్నారు. ఒక్కొక్కరికి ప్రభుత్వం ప్రతినెల వేతనంగా రూ.1000 చెల్లిస్తోంది. భోజనానికి అవసరమైన బిల్లులను తరగతుల వారీగా విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా విడుదల చేస్తోంది. సెప్టెంబర్ నెల నుంచి నేటి వరకు (సెప్టెంబర్, అక్టోబర్, నవంబర్, డిశంబర్) బిల్లులు విడుదల చేయలేదు. ఒకటో తరగతి నుంచి పదోతరగతి వరకు వారానికి మూడు కోడిగుడ్లు పెట్టాలి. ఒక్కో గుడ్డుకు ప్రభుత్వం రూ.5 చెల్లిస్తోంది. మార్కెట్లో ఒక్కోగుడ్డుకు రూ.6 నుంచి రూ.7 వరకు ధర ఉంది.

నిర్వహకులపై భారం..

ప్రభుత్వం కేవలం బియ్యం మాత్రమే అందిస్తోంది. మిగితా నిత్యవసరాలను భోజన నిర్వహకులు కిరాణ దుకాణాల్లో సరుకులు తెస్తున్నారు. వందమంది ఉన్న పాఠశాలలో రోజుకు దాదాపు రూ.750 నుంచి రూ. 1000 వరకు మధ్యాహ్న భోజన నిర్వహకులపై భారం పడుతోంది. ఒకనెలలో కనీసం రూ.20వేల నుంచి రూ.25వేల వరకు భరించాల్సి వస్తోంది. ఈ విద్యా సంవత్సరంలో ఇప్పటి వరకు ఒక్కో నిర్వహకులపై రూ.50వేలు భారం పడుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గిట్టుబాటు కావడం లేదు..



కూరగాయలు, నూనెలు, ఇతర నిత్యవసర సరుకుల ధరలు భారీగా పెరిగాయి. ప్రభుత్వం బిల్లులు పెంచలేదు. ఒక్కో కోడి గుడ్డు రూ.6 నుంచి రూ. 7వరకు ధర పడుతోంది. ప్రభుత్వం ఇచ్చేది రూ.5 మాత్రమే. పెరిగిన ధరలతో పిల్లలకు భోజనం పెట్టడం భారమవుతోంది. సక్రమంగా ప్రభుత్వం బిల్లులు ఇవ్వడం లేదు. ఇలాగైతే వంట చేసి పెట్టడం కష్టమే.

– జగ్గుల గిడ్డమ్మ, పీఎస్ మానవపాడు

సమస్యలు పరిష్కారం కావడం లేదు



పాఠశాలలో ఎదురవుతున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి. మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేస్తున్న వర్కర్లకు ప్రతినెలా రూ.10వేలు గౌరవ వేతనం పెంచాలి. క్రమం తప్పకుండా బిల్లులు విడుదల చేయాలి. పెండింగ్‌లో ఉన్న మూడు నెలల బిల్లులు తక్షణమే విడుదల చేయాలి. బిల్లులు సరిగా అందితేనే విద్యార్థులకు పౌష్టికాహారం లభిస్తుంది.

– నాగేశ్వరమ్మ, చిన్నపోతులపాడు

ఎస్‌టీఓలో పెండింగ్..

ఎస్‌టీఓలో మధ్యాహ్న భోజన నిర్వహకుల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. మధ్యాహ్న భోజన నిర్వహకులు ప్రజావాణి కార్యక్రమం ద్వారా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం. త్వరలో బిల్లులు అందేలా చర్యలు తీసుకుంటాం.

– ఇందిర, ఇన్‌చార్జీ జిల్లా విద్యాశాఖ అధికారి, జోగుళాంబ గద్వాల

కబడ్డీ పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే



పుల్లూరులో కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజేయుడు

ఉండవెల్లి: మండలంలోని పుల్లూరులో సంక్రాంతి పండుగ సందర్భంగా రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలను ఎమ్మెల్యే విజేయుడు ప్రారంభించారు. శనివారం పుల్లూరులో కబడ్డీ పోటీలకు 36 టీంలు వచ్చినట్లు తెలిపారు. ఎమ్మెల్యే విజేయుడు మాట్లాడుతూ గ్రామ క్రీడలకు ప్రాధాన్యతనివ్వాలని, గ్రామీణ అభివృద్ధికి అందరూ సహకరించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో కలుగోట్ల పీఏసీఎస్ చైర్మన్ గజేందర్ రెడ్డి, నాయకులు పరమేశ్వర్‌రెడ్డి, చల్లా గిరిధర్ రెడ్డి, మద్దిలేటి, గోపాల్ పాల్గొన్నారు.

కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి

గద్వాల అర్బన్: జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్‌లో వాహనాల పార్కింగ్ వద్ద నిబంధనలకు విరుద్ధంగా ప్రయాణికుల నుంచి డబ్బు వసూలు చేస్తున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటస్వామి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. డబ్బు తీసుకోని రశీదు ఇవ్వకుండా ప్రశ్నించిన వారిపై ఎదురు దాడికి దిగుతున్నారని, పార్కింగ్ వద్ద వాహనాలను 6గంటలు, 12గంటలు నిలిపినా ఒకే రకమైన డబ్బు వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. రశీదు ఇవ్వకుండా నిబంధనలకు విరుద్ధంగా ప్రయాణికుల నుంచి డబ్బు వసూలు చేస్తున్న పార్కింగ్ కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోని, వాహనాలకు రక్షణగా షెడ్డు నిర్మించాలని, లేని పక్షంలో సీపీఎం ఆధ్వర్యంలో పోరాటం చేస్తామని హెచ్చరించారు.

బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం



హైదరాబాద్‌లో ఏఐసీసీ కార్యదర్శిని ఆహ్వానిస్తున్న గ్రామ పెద్దలు

అలంపూర్: బ్రహ్మోత్సవాలకు ఏఐసీసీ కార్యదర్శిని ఆహ్వానించినట్లు గ్రామ పెద్దలు తెలిపారు. హైదరాబాద్‌లోని నివాసంలో ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సంపత్ కుమార్‌ను ఇటిక్యాల మండలం పెద్దదిన్నె గ్రామస్తులు, పూజారులు శనివారం కలిసి ఆహ్వానించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పూజారులు ఏఐసీసీ కార్యదర్శిని శాలువాతో సత్కరించి ఆహ్వాన పత్రిక అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి శ్యామ్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు సర్పంచ్ జోగుల రవి, మండల అధ్యక్షుడు వెంకటేష్, మద్దిలేటి, శ్రీనాథ్ రెడ్డి, సోమిరెడ్డి, అంజి ఉన్నారు.

రాష్ట్రస్థాయికి కబడ్డీ పోటీలకు..



పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని మానస జిల్లా స్థాయి కబడ్డీ పోటీలో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికై ందని హెచ్ఎం నాగేందర్‌గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల16 నుంచి 18 వరకు జనగాం జిల్లాలో నిర్వహించే అండర్–14 బాలికల కబడ్డీలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నుంచి పాల్గొంటుందన్నారు. విద్యార్థిని రాష్ట్రస్థాయికి ఎంపికకావడం ఎంతో గర్వించదగ్గ విషయమన్నారు. మానసను హెచ్ఎం, పీఈటీ నిరంజన్‌గౌడ్, పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు, నాయకులు అభినందించారు.

సొంత ఊర్లకు వెళ్లే వారు సమాచారం ఇవ్వండి

ఎర్రవల్లిచౌరస్తా: సంక్రాంతి పండుగను పురస్కరించుకొని సొంత గ్రామాలకు వెళ్లే వారు తమ ఇంటి చిరునామా వివరాలను స్థానిక పీఎస్‌లో సమాచారం ఇవ్వాలని కోదండాపురం, ఇటిక్యాల పీఎస్‌ల ఎస్ఐలు కృష్ణదేవా, అశోక్‌బాబులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎవరైతే తగు జాగ్రత్తలు తీసుకొని పీఎస్‌లో సమాచారం ఇస్తారో వాళ్ల ఇండ్లపై పూర్తి స్థాయిలో పోలీస్ నిఘా ఉంటుందని పేర్కొన్నారు.

ప్లాస్టిక్ నిషేధం ఒట్టిదేనా!

- యథేచ్ఛగా గ్రామాల్లో వినియోగం
- అవగాహన కల్పించని అధికారులు
- పర్యావరణానికి పొంచి ఉన్న ముప్పు
- పట్టించుకోని అధికారులు, పాలకులు



ధరూరు: ప్లాస్టిక్ పేరు వినగానే ముందుగా మనకు గుర్తు వచ్చేది పర్యావరణానికి ముప్పు పొంచి ఉంటుందని, కానీ ఏదో స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాల్లోనే హడావిడి చేసే అధికారులు ప్లాస్టిక్ నిషేధంపై దృష్టి పెట్టడం లేదనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. మార్కెట్లో ఏ చిన్న వస్తువైనా, ప్లాస్టిక్ కవర్లలోనే తీసుకెళ్తున్నారు. చివరకు రూ.5 చాయ్ కూడా ప్లాస్టిక్ కవర్లలోనే వాడుతున్నారు. అంటే ప్లాస్టిక్‌ను మన వాళ్లు ఏ మాత్రం వినియోగిస్తున్నారో ఇట్టే అర్థమవుతుంది. ‘ప్లాస్టిక్ రక్కసిని తరిమేద్దాం, ప్లాస్టిక్ భూతాన్ని అంతం చేద్దాం’ అంటూ పాలకులు, అధికారులు ప్లాస్టిక్ నిషేధం అంశాన్ని గాలికి వదిలేశారు. కేవలం పత్రికలకు, ఫ్లెక్సీలపై ప్రకటనలకు మాత్రమే పరిమితమైంది. మండల కేంద్రంలో ప్రతి మంగళవారం నిర్వహించే వారాంతపు సంతతో పాటు నిత్యవసర సరుకులు, కూరగాయలు వంటి వాటికి సైతం ప్లాస్టిక్ కవర్లనే వాడుతున్నారు. ఇటీవల హోటళ్లు, చికెన్, మటన్ దుకాణాల్లోనూ వీటి వినియోగం బాగా పెరిగింది. వాటిని అరికట్టాల్సిన అధికారులు దాని ఊసే ఎత్తకపోవడం సోచనీయం.

ప్రచారమే తప్ప..

ప్లాస్టిక్ వినియోగం వల్ల జరిగే అనార్థాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు మండలంలో ప్రతి గ్రామంలో కార్యక్రమాలు నిర్వహించాలి. నాలుగేళ్ల క్రితం కలెక్టర్‌తో పాటు అన్ని శాఖల అధికారులు మండల కేంద్రంలో ప్లాస్టిక్‌పై అవగాహన కల్పించారు. ఆ కొద్ది రోజులు మాత్రమే ప్లాస్టిక్‌పై నిషేధం కొనసాగింది. ఆ తరువాత పరిస్థితి పాత పద్ధతికే వచ్చింది. పర్యావరణానికి ఎలాంటి ముప్పు ఉందో తెలిసినా జనం ప్లాస్టిక్‌ను వదలడం లేదు.

పొంచి ఉన్న ముప్పు..

ప్లాస్టిక్ వాడకం రోజు రోజుకు పెరుగుతున్న తరుణంలో అదే స్థాయిలో పర్యావరణానికి ప్రమాదం పొంచి ఉంది. నీళ్లు కలుషితం కావడం, ప్లాస్టిక్ గ్లాసుల ద్వారా చల్లని పానియాలు తాగడం, అదే ప్లాస్టిక్ కవర్లలోనే పార్సిళ్లు తీసుకు వెళ్లడం ప్రజలకు అలవాటైంది. చికెన్, మటన్‌లకు సైతం నాణ్యతలేని కవర్లను వినియోగిస్తున్నారు. 51 మైక్రాన్ల కన్నా తక్కువ ఉన్న ప్లాస్టిక్‌ను వినియోగించాలని నిబంధన ఉన్నా.. ఏ ఒక్కరు పట్టించుకోవడం లేదు.

నిబంధనలను కఠినతరం చేయాలి..

ప్లాస్టిక్ సంచులు ప్రజలు వినియోగించకుండా ఉండాలంటే వ్యాపారుల వద్ద ప్లాస్టిక్ అందుబాటులో లేకుండా నిబంధనలు కఠిన తరం చేయాలి. వినియోగదారులు ఇళ్ల వద్ద నుంచే నార లేదా పేపర్ బ్యాగులను తీసుకొచ్చే విధంగా చూడాలి. భావి తరాలకు పొంచి ఉన్న ముప్పును కళా ప్రదర్శనల ద్వారా వివరించాల్సిన అవసరం ఉంది.

చర్యలు చేపడతాం..



ప్లాస్టిక్ వినియోగంపై ప్రభు త్వం కఠినంగా ఉంది. ప్లాస్టిక్ వాడకంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. కానీ పట్టించుకోవడం లేదు. దుకాణాలను, హోటళ్లను తనిఖీ చేసి 51 మైక్రాన్ల కన్న తక్కువ నాణ్యత గలిగి ఉన్న వారిపై చట్టరిత్యా చర్యలు తీసుకుంటాం. ప్రతి గ్రామంలో పంచాయతీ కార్యదర్శుల ద్వారా తనిఖీ చేస్తాం. కాగితపు, నార సంచులు వినియోగించేలా చూస్తాం.

– ఎండీ జబ్బార్, ఎంపీడీఓ, ధరూరు

భక్తులతో కిక్కిరిసిన ఆదిశిలాక్షేత్రం



ఆదిశిలా క్షేత్రంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

మల్దకల్: ఆదిశిలా క్షేత్రమైన స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయం శనివారం భక్తులతో కిక్కిరిసిపోయింది. బ్రహ్మోత్సవాలలో భాగంగా మూడో శనివారం భక్తులు మొక్కులు చెల్లించేందుకు వివిధ పట్టణాల నుంచి స్వామి వారికి దాసంగాలు పెట్టి నైవేద్యాలు సమర్పించుకున్నారు. వారాంతపు సంత కావడంతో పాటు సంక్రాంతి పండగ, శనివారం సెలవుదినం కావడంతో ఆలయం మొత్తం భక్తులతో కిక్కిరిసిపోయింది. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ప్రహ్లాద రావు, ఈఓ, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.



ఆదిశిలా క్షేత్రంలో బారులు తీరిన భక్తులు

నేడు బీచుపల్లిలో గోదారంగనాథ కల్యాణం



కోదండరామస్వామి ఆలయం

ఎర్రవల్లిచౌరస్తా: ధనుర్మాస మహోత్సవాల్లో భాగంగా బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని కోదండరామస్వామి ఆలయంలో భోగి పర్వదినం సందర్భంగా ఆదివారం ఉదయం 11గంటలకు గోదారంగనాథ స్వామి కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ మేనేజర్ సురేందర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయ చుట్టు పక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై కల్యాణాన్ని కనులారా తిలకించి స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు.

జీఓ నం.19ని రద్దు చేయాలి



మాట్లాడుతున్న దళిత ఐక్యవేదిక అధ్యక్షుడు మోహన్

గద్వాల అర్బన్: మదాసి కురువ, మాదారి కురువలకు ఎస్సీ సర్టిఫికెట్ ఇవ్వొద్దని, ఇటువంటి ఉపకులాల వారు జిల్లాలో ఎక్కడా లేరని దళిత ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు మోహన్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీఓ భవనంలో ఎస్సీ ఉపకులాల ఉద్యోగ, ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మదాసి కురువ, మాదారి కురువ అని చెప్పుకుంటూ ఎస్సీ సర్టిఫికెట్‌ను తీసుకోవడానికి ప్రయత్నం చేస్తున్నారని, వారిపై ప్రభుత్వం నిఘా పెట్టాలన్నారు. జీఓ నెం.19రద్దు కోసం దీర్ఘకాలిక పోరాటం చేపడతామని అన్నారు. సమావేశంలో ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం హనుమంతు, గోపాల్, ఉదయ్ కిరణ్, ఆర్ రమేష్ ఉన్నారు.

లీకేజీలతో రోడ్లు ఛిద్రం



పోలీస్ స్టేషన్ పక్కనే లీకవుతున్న నీటి కారణంగా దెబ్బతిన్న తారు రోడ్డు



గట్టులో రోడ్డుపై పారుతున్న మురుగు నీరు

గట్టు: మండల కేంద్రంలో రోడ్లు అధ్వానంగా మారాయి. వాటర్ లీకేజీలతో పాటుగా మురుగు నీరు రోడ్లపై పారడంతో ఆయా కాలనీల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. పోలీస్‌స్టేషన్ పక్కన గట్టు–మాచర్ల రోడ్డు పై వాటర్ లీకేజీ కారణంగా తారు రోడ్డు పూర్తిగా దెబ్బతింది. రోడ్డుపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. దీనికి తోడు భారీ వాహనాల రాకపోకల వల్ల రోడ్డు మరింతగా దెబ్బతింది. రైతు వేదిక దగ్గర మురుగు నీటిని దాటించడానికి ఏర్పాటు చేసిన కల్వర్టు పైపులు భారీ వాహనాల రాకపోకల కారణంగా నడిరోడ్డుపై పగిలిపోయి ప్రమాదకరంగా మారింది. గురుకుల పాఠశాల నుంచి గ్రామంలోకి వచ్చే కొత్త వాహన దారులు ఈ విషయం తెలియక ఇబ్బంది పడుతున్నారు. నేతాజీ సర్కిల్‌లో వాకిలిగేరి వైపు వెళ్లే చోట డ్రైనేజీపై ఇనుప చువ్వలు తేలి ప్రమాదకరంగా మారాయి. అటు వైపు ద్విచక్ర వాహనాలు తప్పా, ఆటో కూడా వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. నేతాజీ చౌక్ నుంచి సంత బజారు వైపు రోడ్డుపై మురుగు నీరు పారుతుండడంతో పాదచారులు ఇబ్బంది పడుతున్నారు. పంచాయతీ పాలకులు స్పందించి గ్రామంలో వాటర్ లీకేజీని అరికట్టి, డ్రెయినేజీ వ్యవస్థను సరిదిద్దాలని ప్రజలు కోరుతున్నారు.

దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు పరీక్షలు



పరీక్షిస్తున్న సూపర్‌వైజర్ చంద్రన్న

మానవపాడు: దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలను చేయించుకోవాలని ఆరోగ్య కేంద్ర సూపర్‌వైజర్ చంద్రన్న అన్నారు. శనివారం మండలంలోని ఆయా గ్రామాల్లో సబ్‌సెంటర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రోగులకు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. ఆరోగ్య సబ్‌సెంటర్లలో ఏఎన్ఎంలు గర్భిణులు, బాలింతలకు బీపీ, షుగర్ థైరాయిడ్ పరీక్షలను చేయాలని తెలిపారు. సబ్‌సెంటర్లలో చిన్నారులకు వ్యాక్సిన్ అందించాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

పంట కాల్వలకు నీటి విడుదల



నాగర్‌దొడ్డి రిజర్వాయర్ వద్ద నీటిని విడుదల చేస్తున్న సిబ్బంది

అయిజ: నెట్టెంపాడు ప్రాజెక్ట్ ద్వారా ఏర్పాటు చేసిన నాగర్‌దొడ్డి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు చెందిన ఆయకట్టు పంటపొలాలకు శనివారం అధికారులు నీటిని విడుదల చేశారు. నాగర్‌దొడ్డి రిజర్వాయర్ ఆయకట్టు కింద సాగుచేసిన వివిధ రకాల పంటలకు ఇంతకాలం కాల్వల ద్వారా సాగునీటిని అందించారు. అయితే బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో నీటిమట్టం పడిపోవడంతో పంట కాల్వలకు నీటి పారుదలను అధికారులు ఇటీవల నిలిపేశారు. దీంతో పంటలు ఎండుముఖం పట్టడంతో వివిధ పార్టీల, సంఘాల నాయకులు, రైతులు ఆయకట్టు రైతుల సమస్యలను కలెక్టర్ బీఎం సంతోష్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన కలెక్టర్ సాగు నీటిని విడుదల చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. దానివల్ల మళ్లీ కాల్వకు సాగునీటిని విడుదల చేశారు. సాగునీటిని వృథా చేయకుండా అవసరమైనంత మేరకు ఉపయోగించుకోవాలని నెట్టెంపాడు ప్రాజెక్ట్ అధికారులు రైతులను కోరారు.